క్లుప్తంగా

నల్లా కనెక్షన్ల తొలగింపు



కనెక్షన్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు చెల్లించిన వారికి రెడ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసుల గడువు పూర్తవడంతో 2,3,5 వార్డుల్లో మంగళవారం మున్సిపల్ సిబ్బంది నాలుగు కనెక్షన్లు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ మార్చి 31వ తేదీ వరకు అన్ని వార్డుల్లో ఇంటి పన్నులు చెల్లించని వారి నల్లా కనెక్షన్లను తొలగిస్తామని తెలిపారు.

కరువు భత్యం పెంపుపై రిటైర్డ్ ఉద్యోగుల హర్షం

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్ర ప్రభుత్వం జూలై నుంచి కరువుభత్యం 2.73శాతం పెంచడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా, మండల శాఖలు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంచిన కరువు భత్యాన్ని నగుదుగా ఒకే విడతలో చెల్లించాలని, మిగతా డీఏలు, ఈహెచ్ఎస్ సౌకర్యంపై సానుకూల నిర్ణయం తీసుకుని పెన్షనర్ల ఆరోగ్య సమస్యలపై నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతినెలా మొదటి తేదీన పెన్షన్లు అందించాలన్నారు. ఈ ప్రకటనలో జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్.సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, మండల అధ్యక్షుడు డి.శ్యాం సుందర్‌రెడ్డి, కార్యదర్శి సుదగాని నాగేశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



పరిశీలిస్తున్న ఎంపీఓ సందీప్‌కుమార్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెంలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీఓ సందీప్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటి వరకు 530 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు, అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్ఓ ఎల్. చరణ్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, ఎ.వేణు, ఏఎన్ఎంలు సైదమ్మ, శకుంతల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


కళ్లద్దాలు పంపిణీ

తిరుమలగిరి : కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తొండ గ్రామ సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు కోరారు. మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు కోఆర్డినేటర్ వాసిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు

తిరుమలగిరి : మండలంలోని 5 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ ఉమేష్‌చారి మంగళవారం తెలిపారు. ఒక్కొక్క భవనానికి రూ.25 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని రాఘవపురం, సిద్దిసముద్రం, చింతలకుంట తండా, మద్రికుంట తండా, నెల్లికుంట్ల తండా గ్రామాలలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి: పండిట్, వ్యాయామ ఉపాధ్యాయుల ఐక్యవేదిక పిలుపు మేరకు మంగళవారం కుంచమర్తి యూపీఎస్‌లో మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు పండిట్, వ్యాయామ పోస్టులను అప్‌గ్రేడేషన్ చేసి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర బాధ్యుడు కోటమర్తి వీరన్న, రత్నకుమారి, కేశవరెడ్డి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉమేష్‌చారి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా తిరుమలగిరి ఎంపీడీఓ ఉమేష్‌చారి నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.విజయ అనంతగిరి ఎంపీడీఓగా డిప్యుటేషన్‌పై వెళ్లారు.

పంటల వివరాల నమోదు ముమ్మరం

- జాజిరెడ్డిగూడెం మండలంలో 80శాతం పూర్తి
- రైతులందరూ నమోదు చేయించుకోవాలంటున్న అధికారులు



వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్న ఏఈఓ

అర్వపల్లి: పంటల నమోదు (క్రాప్ బుకింగ్) కార్యక్రమం మండలంలో ముమ్మరంగా సాగుతోంది. యాసంగి సీజన్‌కు గాను వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల వ్యవసాయ భూముల వద్దకు సర్వేవారీగా వెళ్లి సాగు చేసిన పంటలను ట్యాబ్‌లలో ఆన్‌లైన్ నందు సైట్‌లో నమోదు చేస్తున్నారు. సైట్ లాగిన్ అవటం, పేర్లు, సర్వే నంబర్ల వారీగా నమోదు చేయడం జరుగుతుంది. పంటల నమోదు చేసుకుంటేనే పండించిన పంట ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా టాంటాం చేయించి పొలాల వద్దకు వెళ్లి అక్కడే ఆన్‌లైన్‌లో పంటలను నమోదు చేస్తున్నారు.

22వేల ఎకరాల్లో వరి సాగు

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్ నందు సుమారు 22వేల ఎకరాల్లో రైతులు వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఇప్పటికే 18,200 ఎకరాల పంటల నమోదు కార్యక్రమం పూర్తయింది. మిగిలిన పంటల నమోదును వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. మండలంలో ఇద్దరు వ్యవసాయ విస్తరణ అధికారులు అర్వపల్లి, తిమ్మాపురం క్లస్టర్ల వారీగా పంటల నమోదు జరుపుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయించా



గ్రామంలో రెండు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. అయితే ఈ పంటలకు సంబంధించిన వివరాలను ఏఈఓ వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించా. ఇలా నమోదు చేస్తేనే ధాన్యాన్ని మద్దతు ధరకు కేంద్రంలో అమ్ముకునే అవకాశం ఉంటుంది.

– బంటు యాదగిరి, రైతు, అడివెంల

నమోదు చేయించుకోవాలి



ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను తప్పనిసరిగా ఏఈఓల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలి. నమోదు చేయించుకుంటేనే పండించిన పంట మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవడానికి అవకాశం ఉంది.

– ఆర్.శశిధర్‌రెడ్డి, ఏఓ, జాజిరెడ్డిగూడెం

కుటీర పరిశ్రమగా గుర్తించాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : రాష్ట్రంలోని రజక, నాయీబ్రాహ్మణుల లాండ్రీ షాపులు, సెలూన్లను ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించాలని కోరుతూ నాయీబ్రాహ్మణ, రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం లాండ్రీ షాపులు, సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తుందని, ఎల్‌టీ 2లో ఉండడంతో అధిక విద్యుత్తు చార్జీలు వస్తున్నాయని తెలిపారు. నాయీబ్రాహ్మణులు, రజకులకు విద్యుత్ బిల్లులతో ఇబ్బందులు పడుతున్నందున ఎల్‌టీ 4లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకు వెంకన్న, నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంపాల శ్రీను, జయమ్మ పాల్గొన్నారు.

కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలి

నేరేడుచర్ల : కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదన్నారు. విదేశీ విద్య కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి రూ.20 లక్షల స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చిలకరాజు శ్రీను, రేఖ ఉపేందర్, పరమేష్, పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి



పూజలు చేస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట) : పద్మశాలీల కుల దైవమైన భక్త మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా స్థానిక పద్మశాలీ సంఘ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు అప్ప శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్త మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్త మార్కండేయ స్వామి జయంతి పద్మశాలీ కులస్తులకు అత్యంత పవిత్రమైన రోజు అన్నారు. యావత్ సమాజం సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి చలమల్ల నర్సింహ, పట్టణ ప్రధాన కార్యదర్శి యలగందుల సుదర్శన్, గండూరి రమేష్, సత్యనారాయణ, పిశిక వీరయ్య, దూలం నగేష్, మిర్యాల గోపాలకృష్ణ, అయిటిపాముల శ్రీనివాస్, మిట్టకోల యుగేందర్, పున్న వెంకన్న, కొంగరి ఉపేందర్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి



తిరుమలగిరి: మందులు పంపిణీ చేస్తున్న ఏడీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీ డాక్టర్ రవిప్రసాద్ కోరారు. మంగళవారం తిరుమలగిరి మున్సిపాల్టి పరిధిలోని మాలిపురంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీలతరాములు, వైద్యాధికారిణి రజిత, నరేష్, మహేంద్ర పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం ప్రారంభం

మద్దిరాల : పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, చందుపట్ల గ్రామ సర్పంచ్ కస్తూరి రాణి శ్రీనివాస్‌రెడ్డి రైతులను కోరారు. మంగళవారం చందుపట్లలో పశువుల గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ఆసిఫా, డాక్టర్.కిరణ్, డాక్టర్ జయసుధ, పాల్గొన్నారు.

చాకలిగూడెంలో..

అర్వపల్లి: మండల పరిధిలోని చాకలిగూడెం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్వపల్లి, వర్ధమానుకోట పశువైద్యాధికారులు డాక్టర్ అర్జున్, డాక్టర్ రవి, సర్పంచ్ పీరమ్మ, పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రవి కోరారు. మంగళవారం మిర్యాలలో పశువైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకటి సునితావెంకన్న, ఎంపీటీసీ పరమేష్ పాల్గొన్నారు.

బాలురతో పాటు బాలికలను సమానంగా చూడాలి



నాగారం : క్విజ్‌పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



అర్వపల్లి : మాట్లాడుతున్న ఎంపీపీ



తుంగతుర్తి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : బాలురతో పాటు బాలికలను సమానంగా పెంచాలని మార్పు సొసైటీ బాధ్యులు విప్లవ్‌కుమార్ కోరారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం హంసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యువతులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రజిత, రేవతి, సంధ్య, సరిత, సంధ్యారాణి, దుర్గా, మౌనిక, పద్మ, పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

అర్వపల్లి: బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. అర్వపల్లి కేజీబీవీలో మంగళవారం జరిగిన జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎస్ఓ నాగరాణి, విజయశ్రీ పాల్గొన్నారు.

ఆడ పిల్లలపై వివక్ష తగదు

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట): ఆడపిల్లలపై వివక్ష తగదని తహసీల్దార్ హేమమాలిని అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు నెమ్మికల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిక్షనరీలు బహూకరించగా తహసీల్దార్, ఎస్‌ఐలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ సరస్వతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, రఘు, నాగలక్ష్మి, ఎంవీఎఫ్ మండల ఇంచార్జి వత్సవాయి లలిత పాల్గొన్నారు.

నాగారంలో..

నాగారం : నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బాలికల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లయ్య మాట్లాడుతూ బాలికల పట్ల వివక్ష చూపరాదని అన్నారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు అందజేశారు. కార్యక్రమలో ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, రవీనా పాల్గొన్నారు.

బాలికలకు అవకాశాలు కల్పించాలి

నూతనకల్ : మగవారితో సమానంగా బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంవీఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల బాధ్యులు చిప్పలపెల్లి రవి, అంగన్‌వాడీ టీచర్లు రహీమా, రఫీయా, నాగలక్ష్మీ, రంగినేని రాధిక, పాల్గొన్నారు.

తుంగతుర్తిలో..

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూపరాణి, వసంత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



తిరుమలగిరి : బాలికా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు , ఐసీడీఎస్ సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి) : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జలాల్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలురతో పాటు బాలికలను సమానంగా పెంచాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.డి.కై రూన్నిసా, ప్రధానోపాధ్యాయులు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి : ఎంపీపీ



పెన్‌పహాడ్ : క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

పెన్‌పహాడ్ : క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు నెమ్మాది భిక్షం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జీజేఆర్ కప్ మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆయన సూచించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన బాలిక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తల్లిదండ్రులు బాలికలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణించే విధంగా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, మామిడి అంజయ్య, ఇంద్రసేనారావు, ఎంఈఓ నకిరేకంటి రవి, ప్రధానోపాధ్యాయులు వెంకన్న, వస్రాం, శ్రీనయ్య, కేజీబీవీ ఎస్‌వో ఆసియాజబీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరమ్మ, సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

చివ్వెంల(సూర్యాపేట): క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు భుక్యా సంజీవ్ నాయక్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జీజేఆర్ కప్ నియోజక వర్గ స్థాయి పోటీలను జెడ్పీటీసీ ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడకారులకు ఉచిత భోజన వసతి సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ ధరావతు భద్రు నాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తిరుమలగిరి : అకస్మాత్తుగా గుండె పోటుతో మరణించిన వ్యక్తి కుటుంబానికి అతడితో కలిసి చదువుకున్న స్నేహితులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన బండి మహేష్ (32) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుండాలలో చదువుకున్న 2002– 03 సంవత్సరానికి చెందిన ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.6,200 అందజేశారు. ఈ కార్యక్రమంలో పొన్నగాని యాదగిరి, పురుగుల మల్లేష్, శ్రీహరి నర్సయ్య, శ్రీనివాస్, శేఖర్, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నూతనకల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు నాగునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల విద్యాధికారి రాములు నాయక్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తూము హన్మంతరావు, భూక్య ఉప్పయ్య నాయక్, బదావత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లో నీరా ప్రాజెక్టులు నెలకొల్పాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రతి జిల్లా సెంటర్‌లో నీరా ప్రాజెక్టులను నెలకొల్పి నిరుద్యోగులను ప్రోత్సహించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర సెంట్రల్ కోఆర్డినేషన్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కార్యదర్శి బందారు లక్ష్మయ్య అధ్యక్షతన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, దొరపల్లి శంకర్, దంతాల రాంబాబు, అనంతుల మల్లేశ్వరి, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ , బూర వెంకటేశ్వర్లు, తొగిటి మురళి, రవి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాణాల సత్యనారాయణరెడ్డి, రామసాని మల్లారెడ్డి, తొట్ల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) క్యాలెండర్‌ను మంగళవారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి శ్రీ లింగమంతులస్వామి (పెద్దగట్టు) ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కడెం లింగయ్య, వీరబోయిన రవి, మట్టిపల్లి సైదులు, నర్సింహారావు, హనుమయ్య, సందయ్య, మట్టయ్య, శ్రీనివాస్, వినయ్, సాయి, లింగయ్య, లింగస్వామి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జీఎంపీఎస్ నాయకులు

డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



కొత్తగూడెంలో డీలర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ జగ్గునాయక్

తుంగతుర్తి: డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలని ఏడీఏ జగ్గు నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రైతువేదికలో ఎరువుల విక్రయ డీలర్లు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డీలర్ తమ దుకాణంలో స్టాక్ వివరాలు, అమ్మకం వివరాల బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్, అమ్మకపు వివరాలను కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువుల, విత్తనాలు విక్రయించాలని అన్నారు. రైతులకు తప్పని సరిగా క్రయ, విక్రయ బిల్లులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీలపై సైన్స్ బొమ్మల పేయింటింగ్

తిరుమలగిరి (తుంగతుర్తి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీలపై మంగళవారం సైన్స్ బొమ్మల పేయింటింగ్ వేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు జలగం రామచంద్రం గౌడ్, కార్యదర్శి ఐతె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, కష్ణమాచారి, లక్ష్మణ్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాటిపాములలో పాఠశాల గోడలపై బొమ్మలు వేయించిన లయన్స్ క్లబ్ సభ్యులు

దాచారంలో అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : మండల పరిధిలోని దాచారంలో అట్రాసిటీ కేసుపై మంగళవారం డీఎస్పీ నాగభూషణం విచారణ చేశారు. గ్రామానికి చెందిన పల్లెల గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాక్షులను డీఎస్పీ విచారించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి,సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలి : మల్లు



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున్‌రెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనవరి 26న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రాక్టర్ ర్యాలీలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతాంగం పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని ఆందోళ చేసిన రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్రి శ్రీరాములు, దండ వెంకటరెడ్డి, జిల్లా ఆఫీస్ బేరర్స్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పల్లె వెంకటరెడ్డి, పల్లా సుదర్శన్, దేవరం వెంకటరెడ్డి గుమ్మడవెల్లి ఉప్పలయ్య , దుగ్గి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

పెన్‌పహాడ్ : రోడ్డు ప్రమాదంలో ఎదిగిన కుమారుడు చనిపోయినందుకు ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి కోరారు. ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన మామిడి కళ్యాణ్‌చక్రవర్తి కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, చినపంగి నర్సయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాంబాబు, బీంపంగి వెంకన్న పాల్గొన్నారు.